క్లుప్తంగా

నేడు రుణ మేళా

దుగ్గిరాల: స్వయం ఉపాధి కోసం 2024–25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ రుణాల మంజూరుకు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, సెలక్షన్ కమిటీ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 10:30 గంటలకి ధృవపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా

దుగ్గిరాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. ఎన్నికల వేళ విద్యుత్ చార్జీలపై బాదుడే బాదుడు కార్యక్రమం టీడీపీ నిర్వహించిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగిస్తూ.. విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్, అమ్మిరెడ్డి, సుబ్బా రావు పాల్గొన్నారు.

వీర్లపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం శుక్రవారం వీర్లపాలెం జరిగింది. ఆ పార్టీ మండల నాయకుడు టి.శివ గోపయ్య ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించారు. గోపయ్య మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వాగ్దానాలు నిలబెట్టుకునే విధంగా లేదని, ప్రజల కోసం ప్రతి సమస్యపై తప్పకుండా రానున్న రోజుల్లో పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోళ్ల శ్రీనివాసరెడ్డి, ధనుంజయ్, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిరణ్ చందు



మంగళగిరి: మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ నాయకుడు జువ్వాది కిరణ్ చందు నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన కిరణ్ చందు మంగళగిరి రూరల్ తెలుగు యువత కార్యదర్శిగా రెండు సార్లుగా పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, టీడీపీ శాశ్వత సభ్యుడి ఉన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శుక్రవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను కె. ఆదినారాయణతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ఎన్ని ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇమాంబి, హగ్గయ్య, గురవయ్య, ఖాసిం, రమణ, రాజకుమారి, సారమ్మ, మల్లేశ్వరి, అంకయ్య పాల్గొన్నారు.

మతిస్థితిమతం లేని వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్‌రావు కాలనీలో ప్రియురాలి ముందు హీరోయిజం చూపించేందుకు ప్రయత్నం చేసి మతిస్థిమితం లేని వ్యక్తి మృతికి కారణమైన వారిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, శుక్రవారం దర్యాప్తు చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం కేఎల్‌రావు కాలనీ హోసన్నా ప్రార్థన మందిరం సమీపంలో ఒక నివాసంలోకి మతిస్థిమితం లేని వ్యక్తి వెళ్లాడు. ఆ ఇంట్లో ఉన్న బాలిక తన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా కేఎల్‌రావు కాలనీ ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మైనర్ స్నేహితుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో అతను బైక్‌పై మరో ఇద్దరిని ఎక్కించుకుని ఘటనా స్థలానికి వచ్చి, ఆ మతిస్థిమితం లేని వ్యక్తిని చితకబాదారు. ఇదే వ్యక్తిపై గత నాలుగు రోజుల క్రితం వీరే వేరే ప్రాంతంలో దాడిచేసి గాయపరిచారు. మొన్న చెప్పినా మళ్లీ వచ్చావా అంటూ పెద్దపెద్దగా కేకలు వేస్తూ రోడ్డుపై ఉన్న మొక్కలు పీకి వాటితో దాడికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. దాడి చేసే సమయంలో మతిస్థిమితం లేని వ్యక్తి కిందపడి చనిపోయాడని చెబుతున్నారు. గాయపడి మరణించాడా, కిందపడి మృతి చెందాడా అనే విషయాలను దర్యాప్తు చేస్తున్నామని, పోస్ట్‌మార్టం చేసిన తర్వాత నిర్ధారిస్తామని సీఐ కల్యాణ్ రాజు తెలిపారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి



కంచె దాటుకుని బైపాస్‌కు వెళ్తున్న వృద్ధుడు



సర్వీసు రోడ్డు దాటి బైపాస్‌కు వెళ్తున్న ప్రయాణికులు

- జాతీయ రహదారి వద్ద తప్పని ఇక్కట్లు
- సర్వీసు రోడ్డులోకి చేరుకునేందుకు తిప్పలు
- ఇనుప కంచెదాటి..హైవే దాటుతున్న ప్రయాణికులు

మంగళగిరి: పట్టణ పరిధిలోని 16వ నంబరు కోల్‌కతా – చెన్నై జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రాధాన్యం ఏర్పడింది. రహదారిపై ఉన్న తెనాలి – మంగళగిరి ఫ్లైఓవర్ వద్ద ఈ ఆవశ్యకత ఉంది. ఇటు గుంటూరు నుంచి, అటు విజయవాడ నుంచి వచ్చే మంగళగిరి వాసులు, ప్రయాణికులు తెనాలి ఫ్లైఓవర్ వద్ద ప్రధాన రహదారిపైనే దిగుతున్నారు. దీంతో అక్కడి నుంచి వారు మంగళగిరికి వెళ్లాలంటే సర్వీసు రోడ్డులోకి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డుకు చేరుకునేందుకు ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఇనుప ముళ్ల కంచెను దాటుకుని ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. దీంతో వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అంతేకాకుండా మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల వారు అధికంగా తెనాలి – మంగళగిరి ఫ్లైఓవర్ వద్ద బస్సులు ఎక్కుతుంటారు. ఇక్కడ సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారి దాటేందుకు మార్గం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. సురక్షితంగా జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డుకి వెళ్లాలంటే బ్రిడ్జి ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న



ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

మేడికొండూరు: గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు కృషి చేయాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మన్నవ స్వప్న తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తహసీల్దారు ఎం.హరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో అమరావతి ఓఆర్‌ఆర్‌తో పాటు అమరావతి నుంచి ఫిరంగిపురం వరకు నాలుగు లైనుల రహదారికి భూసేకరణ రెండు నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. రీ సర్వేలో సమస్యల గురించి 700 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించామని చెప్పారు. అటవీ శాఖ పరిధిలో పేరిచర్ల లోని నగరవనం ప్రాంతంలో 1.50 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అటవీశాఖ అధికారులు సంతోష్ తెలిపారు. జులైలో మొక్కలను పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. వ్యవసాయ శాఖ అధికారిణి జె..వాసంతి మాట్లాడుతూ ప్రతి రైతు యూనిక్ ఐడీ నంబరు కోసం ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పాటిబండ్ల పూర్ణ శంకరరావు పాల్గొన్నారు. మండలంలోని సిరిపురం తాగునీటి సమస్యను పరిష్కరించి, కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకర్‌ను పునర్నిర్మించాలని ఎంపీటీసీ సభ్యురాలు షేక్ అఫ్రోజ్, పంచాయతీ వార్డు సభ్యులు హుస్సేన్ కోరారు. సమస్య పరిష్కారానికి విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో తాము రాజీనామాలకు సైతం సిద్ధమని తేల్చి చెప్పారు. ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఇన్చార్జ్ ఎంపీడీవో పూర్ణ శంకర హామీ ఇచ్చారు. దీంతో తాత్కాలికంగా రాజీనామా ఆలోచనను విరమించుకున్నారు.

ఇఫ్తార్ విందులో మంత్రి లోకేష్



మంగళగిరి: పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో కల ముస్లిం సోదరుడు షేక్ షహన్షా నివాసంలో ఇఫ్తార్ విందు స్వీకరించారు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్. శుక్రవారం రాత్రి నగరంలో పర్యటించిన లోకేష్ షెహన్షా నివాసంలో విందు స్వీకరించి, వారి కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు కుటుంబ బాధ్యత తీసుకుంటానని భరోసానిచ్చారు.

స్వామివారి వస్త్రాల బహిరంగ వేలం

మంగళగిరి టౌన్ : శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం జరుగుతుందన్నారు.

సంక్షిప్తం

- **ఐదు నెలల క్రితం మృతి.. ఇప్పుడు పోస్ట్‌మార్టం**

తాడేపల్లి రూరల్ : కుంచనపల్లిలో క్యాపిటల్ టవర్‌లో నివాసముంటూ ఐదు నెలల క్రితం మృతి చెందిన ఓ మహిళ మృత దేహానికి తాడేపల్లి పోలీసులు శుక్రవారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. సేకరించిన వివరాల ప్రకారం కుంచనపల్లిలో నివాసముంటూ కేఎల్ యూనివర్శిటీలో లా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వినోదిని దేవి (48) అనుమానాస్పద స్థితిలో గతేడాది నవంబర్ 14న మృతి చెందింది. అప్పట్లో ఆమె భర్త రమణారెడ్డి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకుండా అనంతపురం తీసుకెళ్లి బంధువుల సమక్షంలో భార్య మృతదేహాన్ని ఖననం చేశారు. ఆమె మృతిపట్ల అనుమానం వ్యక్తం చేస్తూ వినోదిని దేవి అన్నయ్య అనిల్‌కుమార్ తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురంలో ఆమె మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు.

- **సహజీవనం ప్రాణం మీదకు తెచ్చింది**

మంగళగిరి: సహజీవనం యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని చినకాకానిలో నివాసముంటున్న ప్రమీల, పారె జైపాల్ అనే ఇద్దరు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. ప్రమీలకు ఇద్దరు కుమారులున్నారు. వారికి వివాహమైంది. ఆమె భర్త మృతి చెందాడు. జైపాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జైపాల్ కొంతకాలంగా కుటుంబాన్ని వదిలేసి, ప్రమీలతో కలిసి ఉంటున్నాడు. గత కొంత కాలంగా ప్రమీల తన కుమారుల వద్దకు వెళ్తాననడంతో.. ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు మధ్య గొడవ తీవ్రతరం కాగా ప్రమీల తన పక్కనే ఉన్న కత్తి తీసుకుని జైపాల్‌ను పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వివరాలు సేకరించారు. కత్తిపోటుకు గురయిన జైపాల్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రత్యూషను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- **వక్ఫ్ పరిరక్షణ సభను జయప్రదం చేయండి**

దుగ్గిరాల: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న నిరసన సభను జయప్రదం చేయాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభానీ పిలుపు నిచ్చారు. శుక్రవారం దుగ్గిరాల లోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం విజయవాడలోని ధర్నా చౌక్ జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ బిల్లు ఆమోదం పొందితే ముస్లిం సమాజానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలాని, మస్తాన్ వలి, ఖుద్దూస్, జాన్ షైదా పాల్గొన్నారు.

- **ప్రతి మానవుడు దైవత్వంతో మెలగాలి**

ఫిరంగిపురం: ప్రతి మానవుడు దైవత్వంతో మెలగాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంఘ సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం పాస్టర్ పగడాల ప్రవీణ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి సమాజానికి హేతువు కాదని చెప్పారు. మానవ రక్షణకు అందరి సహకారం ఎంతో అవసరమన్నారు. యనమాల సుందరరావు కవితలు పాడి వినిపించారు. అనంతరం పగడాల ప్రవీణ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, మదార్, ఫాదర్ మద్దు బాలస్వామి, ఎం. పురుషోత్తం, టి.ఆనందబాబు, జాన్‌బాబు పాల్గొన్నారు.

- **రుణ మేళాకు 404 మంది హాజరు**

ఫిరంగిపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రుణ మేళా నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు తెలిపారు. వివిధ కులాలకు చెందిన 505 మంది బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకోగా 404 మంది లబ్ధిదారులు హాజరయ్యారన్నారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- **చైతన్య తపోవన్‌లో ఉగాది వేడుకలు**

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలోని నులకపేటలో ఉన్న చైతన్య తపోవన్‌లో ఉగాది వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు మాతా శివానంద సరస్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉగాది వేడుకల్లో వేదస్వస్తి, పంచాంగ శ్రవణం, మహాత్ముల ఆశీర్వాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అయోధ్యరాముని కోదండ ధనుర్బాణ సందర్శనం కార్యక్రమం నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉగాది వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

- **పరిహారానికి దరఖాస్తు గడువు పొడిగింపు**

మంగళగిరి టౌన్: ఈశ్రమ గుర్తింపు కార్డు కలిగిన అసంఘటిత కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా పరిహారం కోసం దరఖాస్తు గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు సహాయ కార్మిక కమిషనర్ డీవీ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యానికి లక్ష రూపాయలు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. పొన్నూరు, చుండూరు, తెనాలి, వట్టిచెరుకూరు, చేబ్రోలు, కొల్లిపర, దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ మండలాలకు చెందిన వారు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్మికశాఖ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

- **విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నేతల ధర్నా**

మంగళగిరి టౌన్ : స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొడతామని ఎన్నికలకు ముందు నారా లోకేష్ చెప్పారని, గెలిచిన తరువాత మంగళగిరిలో స్మార్ట్ మీటర్లు పెడుతుంటే చూస్తుంటారేమిటని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రూ అప్, సర్దుబాటు, ఇతర సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళగిరి విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన నాయకులకు పొంతన లేకుండా నేడు ఇష్టానుసారంగా పెంచుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 9 నెలల కాలంలో 15 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, నాయకులు కమలాకర్, బాలాజీ, జెవి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

- **నేడు కేఎల్‌యూలో ఈత పోటీలు**

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలోని అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం ఉదయం 8:30 గంటలకు జాతీయ స్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె. హరికిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్శిటీల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. 100 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై స్ట్రోక్ నాలుగు రకాల ఈత పోటీలతో పాటు ఫ్రీస్టైల్ రిలే 400 మీటర్స్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అని పేర్కొన్నారు.

- **దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం**

ఫిరంగిపురం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని సదావర్తి అన్నదాన సత్రం ఫౌండర్ గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణి అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో సదావర్తి అన్నదాన సత్రం ఆధ్వర్యంలో శుక్రవారం మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **వేసవిలో జాగ్రత్తలు పాటించాలి**

ఫిరంగిపురం: గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 232 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎంపీహెచ్ ఎస్ షేక్.అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంథోనిరాణి, బాబురావు, ఆశలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

- **విపత్తుల నిర్వహణపై అవగాహన**

తాడేపల్లి రూరల్ : విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ కమాండ్ సుజిత్ గొప్ప, ఏఎస్ఐ నరేందర్ సింగ్‌లు మాట్లాడుతూ అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో వివరించారు. ఎమ్మార్వో సీతారామయ్య, ఆర్ఐ వేదాంతరావు, వైద్యులు డాక్టర్ శాంతకుమారి, తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి, ఇరిగేషన్ ఏఈ సురేష్, విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మణ్ నారాయణ, అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

- **సమస్యలను పరిష్కరించాలి**

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ జొన్నవిత్తుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక, మురుగు పారుదల లేక తాము నివాసం ఉంటున్న ప్లాట్లలో నివసించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. న్యాయవాది రమేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం తహసీల్దార్ జె.ప్రసాదరావుకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు ఈమని అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, అధికారుల దృష్టి కి తీసుకెళ్తున్నట్లు వివరించారు. పార్టీ మండల కార్యదర్శి షేక్. మస్తాన్‌వలి, కె.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో అల్లంవారిపాలెం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసివేయాలని, సర్దుబాటు చార్జీలు, టైమ్‌ఆఫ్ డే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల నాయకులు మస్తాన్‌వలి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో పర్యావరణ పరిరక్షణ ప్రదర్శన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీన్ డాక్టర్ సీవీ టామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్

మంగళగిరి: నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో శుక్రవారం జాతీయ పర్యావరణ పరిరక్షణ ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా 58 యూనివర్శిటీల నుంచి 208 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. యూనివర్శిటీ ఎన్విరాన్మెంట్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ ప్రదర్శనను యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ప్రదర్శన ప్రాముఖ్యతను డీన్ రంగ భాష్యం వివరించారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి 38 ఎగ్జిబిట్స్ వచ్చాయి. ఉత్తమ ప్రదర్శనలుగా ఎంపికైన డెహ్రాడూన్‌కు చెందిన డూన్ గ్లోబల్ యూనివర్శిటీ ప్రథమ బహుమతి రూ.20 వేలు, విజ్ఞాన యూనివర్శిటీ ద్వితీయ బహుమతి రూ.15 వేలు, ఎస్ఆర్ యూనివర్శిటీ తృతీయ బహుమతి రూ.10 వేలు నగదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ సీవీ టామ్,డాక్టర్ షోజీ, డాక్టర్ శుభశ్రీ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి



నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల ధర్నా

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిలోని నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేడు లక్ష పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై వేసిందని విమర్శించారు. తెనాలి, మంగళగిరి పట్టణాలను స్మార్ట్ సిటీల పేరుతో స్మార్ట్ బాదుడు మొదలుపెట్టబోతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కొట్టే కరుణాకర్, వేముల దుర్గారావు, డి.విజయ్‌బాబు, లీలమ్మ, గోపమ్మ, కె.బాబూరావు, వెంకన్న, ఫిరోజ్‌ఖాన్, తులసమ్మ, వెంకటరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకువద్దాం

సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు



రూరల్ సమావేశంలో పాల్గొన్న సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేలా అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి భవన్‌లో వేర్వేరుగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేమారెడ్డి మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగరవేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని, ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులకు దిగుతోందన్నారు. అవసరం అయితే జైల్ భరో నిర్వహించి, జైల్లో ఉందామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో కొంతమందికి చేతులు తడపకపోతే పనులు కావడంలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ పాతూరు లలితకుమారి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభా వేదిక ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

వెలగపూడి(తాడికొండ): తుళ్లూరు మండలం వెలగపూడి రాష్ట్ర సచివాలయం సమీపంలో ఆదివారం పీ–4 విధానాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పోలీసు అధికారుల బందోబస్తు, ఆర్ అండ్ బీ అధికారులు బారికేడింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను తప్పకుండా పాటించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతి బసు, పీడీ డ్వామా శంకర్, డీపీవో నాగసాయి కుమార్, అర్ అండ్ బీఎస్ఈ కల్యాణ చక్రవర్తి, జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, డీసీహెచ్ ఎస్ మయానా మజీదాబి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకులకు అభినందన

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ నుంచి వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు ఎన్నికైన నాయకులను వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుక్రవారం అభినందించారు. రాష్ట్ర నాయకులుగా ఎన్నికైన మేకా వెంకటరామిరెడ్డి, ముదిగొండ వెంకటేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు (పండు) ప్రజా సమస్యలపై పోరాడాలని వారు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ హనుమంతరావుకు, సమన్వయ కర్త దొంతిరెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని సన్మానించారు.

- **ప్రభుత్వం అలసత్వం**

మంగళగిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల నియామకాల్లో అలసత్వం వహిస్తున్నాయని ఏపీసీఎల్‌సీ జిల్లా సహాయ కార్యదర్శి జి. గోపీనాథ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్కే నాగుర్ వలి విమర్శించారు. ఆదివాసులపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.